క్లుప్తంగా

విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలి



అభివృద్ధిపై సర్పంచ్, గ్రామస్తులతో చర్చిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

స్వర్ణ(కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను మంచి ప్రయోజకులనుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈఓ ఎంఈ సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని స్వర్ణ హెచ్ డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోటాని మధుసూదనరావు, సీఆర్పీ కమలాకర్, హెచ్ఎం ఉషారాణి, మార్తమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీటితీరువా వసూళ్లు వేగవంతం చేయాలి

చీరాల టౌన్: నీటి తీరువా వసూళ్లను నెలాఖరు కల్లా పూర్తి చేయడంతో పాటుగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్న వ్యవసాయ భూములకు సంబంధించి నీటి తీరువా రూ.45 లక్షలు వసూళ్లు లక్ష్యంగా గ్రామ రెవెన్యూ అధికారులు పనులు చేయాలన్నారు. రైతుల నుంచి విధిగా నీటి తీరువాను వీఆర్వోలు సక్రమంగా వసూళ్లు చేసి నగదును బ్యాంకులో జమ చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సుశీల, గ్రామ, పట్టణ వీఆర్వోలు ఉన్నారు.

యానాదుల సమస్యలు పరిష్కరిస్తాం



వేటపాలెం: ఎస్టీ కాలనీలో నివసించే యానాదులకు సంబంధించిన పలు సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ రోశయ్య కాలనీలో రైల్వే ట్రాక్ పక్కన గల యానాది కాలనీని ఆర్డీవో సోమవారం సందర్శించారు. ఇంటి నివేశన స్థలాలు లేని వారికి త్వరలో నివేశన పట్టాలు అందిస్తామన్నారు. గ్రామ పంచాయతీ ద్వారా కాలనీ వాసులకు తాగునీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీలోని సమస్యల గురించి ఆర్డీవోకు యానాది నాయకులు వివరించారు.

పాముకాటుకు గురైన అంగన్‌వాడీ కార్యకర్త

బల్లికురవ: రేషన్‌డీలర్ నుంచి పౌష్టికాహారం తీసుకుని అంగన్‌వాడీ కేంద్రానికి చేర్చి ఇంటికి వస్తుండగా పాము కాటు వేసింది. ఈఘటన ఆదివారం రాత్రి మండలంలోని కొప్పరపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీ జరిగింది. అందిన సమాచారం ప్రకారం నార్కెట్‌పల్లి–మేదరమెట్ల నామ్ రహదారికి తూర్పుభాగంలోని ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కార్యకర్త జే. చిన్నమ్మాయి, సహాయకురాలుతో రేషన్‌డీలరు వద్దకు వెళ్లి పౌష్టికాహారాన్ని కేంద్రానికి చేర్చారు. రిజిస్టర్‌లలో సరుకు నిల్వలను నమోదు చేసి ఇంటికి వస్తుండగా ఈప్రమాదం సంభవించింది. కేంద్రం చుట్టూ ముళ్ల పొదలు, చీకటిగా ఉండటంతో ఎడమ కాలుకు పాము కాటు వేసినట్లుగా గుర్తించింది. ఇంటికి వచ్చేలోపే తల తిరుగుతూ అస్వస్థతకు లోనైంది. కుటుంబ సభ్యులకు విషయం చెప్పటంతో హుటాహుటిన అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సకు తరలించారు. చికిత్స పొందుతూ ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

వేటపాలెం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై జనార్దన్ వివరాల మేరకు.. దేశాయిపేట నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ని పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం తెలిపారు. ట్రాక్టర్‌ని పోలీసు స్టేషన్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండలం పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

చీరాల రూరల్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల పరిధిలోని కారంచేడు బాధిత పోరాట గ్రామమైన విజయనగర్ కాలనీలో నాయకులు ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు బాపట్ల జిల్లా ఎంఎస్పీ అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుడ్డు వందనం, జిల్లా ఎంఈఎఫ్ అధ్యక్షుడు వంగిపురపు రమేష్‌లు మాట్లాడారు.



కొప్పరపాడు అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ ఎరువు దిబ్బలు, ముళ్ల పొదలు



కొమ్మినేనివారిపాలెంలో ఎమిదేళ్లుగా నిలిచిన భవనాలు

అంగన్‌వాడీ.. అసౌకర్యాల బడి!

- అసౌకర్యాల నడుమ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ
- బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో శాశ్వత భవనాలు లేని దుస్థితి
- భవనాల చుట్టూ ఎరువుల దిబ్బలు, విషసర్పాల సంచారం
- అసంపూర్తిగా నిలిచిన భవనాలు
- అద్దె భవనాల్లో అవస్థలు

బల్లికురవ: మాతాశిశు సంరక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ భవనాలు వెక్కిరిస్తున్నాయి. శాశ్వత భవనాలు లేక అద్దె భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 134 కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీతో పాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నారు. రెండు మండలాల్లో 48 సొంత భవనాలు ఉన్నాయి. 46 కేంద్రాలు అద్దె భవనాల నడుస్తుండగా, 40 ప్రాథమిక పాఠశాల్లోనే నిర్వహిస్తున్నారు. సొంత భవనాలు మంజూరైన వాటిలో 24 కేంద్రాలు అసంపూర్తి పనులతో వినియోగంలో లేవు. నిర్మాణం పూర్తయిన భవనాలకు ప్రహరీ లేనందున చిల్లచెట్లు పెరిగి అపరిశుభ్ర వాతావరణంలో విషసర్పాలు పగలురాత్రి తేడా లేకుండా సంచరిస్తున్నాయి.



వల్లాపల్లిలో తుదిదశ పనులు పూర్తికాక పరాధీనుల ఆధీనంలో..

అసంపూర్తి భవనాలు పూర్తి చేస్తేనే..

బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి, కొణిదన, గంగపాలెం, సంతమాగులూరు మండలంలో కలిపి 24 వరకు అసంపూర్తి భవనాలు లెంటల్, కప్పు దశలోనే నిలిచాయి. ఒక్కో కేంద్రంలో అద్దె భవనానికి రూ.2000 మాత్రమే ప్రభుత్వం అద్దె చెల్లిస్తుంది. రూ.3 వేల నుంచి రూ.4 వేలు చెల్లిస్తే కానీ గ్రామాల్లో కేంద్రాలకు భవనాలు దొరకడం లేదని కార్యకర్తలు తెలిపారు.

విషసర్పాల సంచారం..

కొప్పరపాడు ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రం చుట్టూ ఎరువు దిబ్బలతో పాటు విషసర్పాల సంచారం అధికమైంది. పగలురాత్రి తేడా లేకుండా కేంద్రం చుట్టూ పాములు సంచరిస్తున్నాయని చిన్నారుల తల్లిదండ్రులు తెలిపారు. తాజాగా ఆదివారం రాత్రి కేంద్రానికి పౌష్టికాహారాన్ని చేర్చి ఇంటికి వెళ్తుండగా కార్యకర్త జే. చిన్నమ్మాయి పాము కాటుకు గురైంది. హుటాహుటిన కుటుంబ సభ్యులు చికిత్సకు అద్దంకి ప్రభుత్వ వైశ్యాలకు తరలించారు. పాతమల్లాయపాలెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం ప్రహరీ పగుళ్లు ఇస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2018లో చేపట్టిన అసంపూర్తి నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయించి వినియోగంలోకి తేవాలని చిన్నారుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఈ పరిస్థితులు ఇలా ఉంటే గత ప్రభుత్వ హయాం వరకు రేషన్ సరుకులను ప్రాజెక్టు కార్యాలయం నుంచి నేరుగా కేంద్రానికి చేర్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు.



కేవీ పాలెంలో అసౌకర్యాల మధ్య నడుస్తున్న కేంద్రం

రేషన్ డీలర్ వద్దకు వెళ్లి పౌష్టికాహారానికి సంబంధించిన సరుకులను కార్యకర్త, సహాయకురాలు తెచ్చుకోవాల్సి వస్తుంది.



డీ సుధ, సీడీపీవో, బల్లికురవ

ఈ విషయాలపై సంతమాగులూరు ప్రాజెక్ట్ సీడీపీవో డీ సుధను వివరణ కోరగా అసంపూర్తి భవనాలు పూర్తి చేయించేందుకు ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. రూ.1.7 కోట్లు నిధులు అవసరమవుతాయని, నిర్మాణం పూర్తయిన భవనాలకు ప్రహరీలు మంజూరు చేయాలని కోరామన్నారు. అంగన్వాడీ కేంద్రాల పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ అధికారులు చొరవచూపాలన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాలకు దాతలు లేదా ప్రభుత్వ స్థలాలను కేటాయిస్తే భవనాల నిర్మాణం చేపట్టవచ్చు.

వీర మరణానికి, త్యాగానికి ప్రతీక మొహర్రం



దగ్గుబాడులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న ముస్లింలు, మహిళలు

దగ్గుబాడు (కారంచేడు): వీర మరణానికి, త్యాగానికి ప్రతీకగా మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ అని వక్తలు పేర్కొన్నారు. మొహర్రం పర్వదిన వేడుకలను ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు కన్నుల పండువగా నిర్వహించారు. మండలంలోని దగ్గుబాడు, కారంచేడు, కుంకలమర్రు, ఆదిపూడి గ్రామాల్లో వేడుకలను జరుపుకున్నారు. దగ్గుబాడు ఈద్గా వద్ద జరిపించిన పీర్ల ఊరేగింపులో గందంతో గ్రామంలోని ముస్లింలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అర్ధరాత్రి తరువాత పీర్లతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన నిప్పుల గుండంలో పూలను తొక్కి, తమ భక్తిని చాటుకున్నారు. చావిడి వద్దకు వచ్చి చదివింపుల తరువాత పీర్లను లోపల పెట్టారు. కార్యక్రమంలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



దగ్గుబాడు చావిడి వద్ద పీర్లతో తిరుగుతున్న ముస్లింలు



కొప్పరపాడులో జెండాలతో గ్రామోత్సవం చేస్తున్న భక్తులు

బల్లికురవ: మొహర్రం వేడుకలు మండలంలోని కొప్పరపాడు గ్రామంలో సంప్రదాయబద్ధంగా సోమవారం రాత్రితో ముగిశాయి. పెద్ద షరగత్తులో భాగంగా పీర్లను చావిడిలు, గమ్మటాలు, రంగురంగుల దివిటీలు, వెండిగొడుగులు, నాగాభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పీర్లతో అగ్ని గుండంలో నడిచారు. జెండాలు, పీర్లతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ తదుపరి పీర్లను తిరిగి పీర్ల చావిడిలోకి చేర్చారు. అనంతరం అగ్ని గుండాన్ని పూడ్చి వేశారు. వేడుకలు ముగింపులో భాగంగా అన్నసంతర్పణ చేపట్టారు.

ప్రజల మన్ననలు పొందిన విజయభాస్కర్

చినగంజాం: వైద్యవృత్తిని నిబద్ధతో నిర్వహించి ప్రజలందరి మన్ననలు పొందిన వైద్యులు విజయభాస్కర్ అని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పీ సాయిశ్రీ చరణ్ అన్నారు. చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వహించిన సాతులూరి విజయభాస్కర్ బదిలీపై ఒంగోలు రిమ్స్‌కు వెళ్లడంతో ఆయనకు వీడ్కోలు సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయభాస్కర్ చినగంజాం ఆసుపత్రిలో ఎనిమిది సంవత్సరాలు విధులు నిర్వహించి ప్రజలందరికీ అందుబాటులో ఉండి సకాలంలో వైద్యం అందించారన్నారు. ఆరోగ్య సిబ్బంది యూడీసీ బాలలక్ష్మి, పీ సుశీల, ల్యాబ్ టెక్నీషియన్ కే శ్యాంప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు యు పద్మజ. ఏఎన్ఎంలు కే తిరుపతమ్మ, దే సువార్త, కే రమాదేవి, ఎం సింగమ్మలు బదిలీ కాగా వారికి వీడ్కోలు నిర్వహించి సత్కరించారు. అదే విధంగా వైద్యాధికారిగా వచ్చిన సిరివెన్నెల, యూడీసీ షేక్ రియాజ్ అహ్మద్, వీ రామలక్ష్మి, పీవీ సుశీల, ఆరోగ్య కార్యకర్తలు ఎస్ పద్మావతి, వై మాధవి, డీ నాగరాజు వచ్చిన కొత్త సిబ్బందికి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో 104 నోడల్ అధికారి బ్రహ్మం, 108 పీ రాఘవ, డీఎం నాగేశ్వరరావు, డాక్టర్ భవానీ, గ్రామ పెద్దలు ఆమంచి వెంకటసుబ్బారావు, సందు శ్రీనివాసరావు, టీ జయరావు, పీ లక్ష్మీనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యాధికారి విజయభాస్కర్, సిబ్బందిని సన్మానిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పొగాకు కొనుగోలు కేంద్రం పరిశీలన

పర్చూరు (చిన్నగంజాం): పర్చూరులోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రత్యేక అధికారి లవన్న పరిశీలించారు. సోమవారం స్థానిక అధికారులతో కలిసి స్థానిక గిడ్డంగులను పరిశీలించి సిసి కెమెరాలు, ఫైర్ సామగ్రి, సెక్యూరిటీ గురించి అడిగి తెలుసుకున్నారు. వాహనాల రాకపోకలకు అంతర్గత రోడ్ల పరిస్థితిని కూడా గమనించారు. పొగాకుని అమ్ముకునే రైతులు తమ వంతు వచ్చినప్పుడు 20 పొగాకు చెక్కులకు మించి తీసుకొని రావద్దని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, మార్క్‌ఫెడ్ డీఎం, రైతులు పాల్గొన్నారు.



పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి లవన్న

కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని వినతి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న అభ్యర్థులు

చీరాల: కానిస్టేబుల్ పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించిన ప్రతి అభ్యర్థికి న్యాయం జరిగేలా చూడాలని పరీక్షలు రాసిన అభ్యర్థులు సోమవారం ఆర్డీవో టీ చంద్రశేఖర్‌నాయుడిని కలిసి వినతిపత్రం అందించారు. ఇటీవల కాలంలో జరిగిన డీఎస్సీ, గ్రూప్–2, కానిస్టేబుల్ పరీక్షలను అనేక మంది అభ్యర్థులు రాశారన్నారు. అయితే డీఎస్సీ, గ్రూప్–2 ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు కూడా ఎంపికయ్యే ప్రమాదం ఉందని, దీని కారణంగా కానిస్టేబుల్ ఉద్యోగాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఏళ్ల తరబడి చదువుతున్న అభ్యర్థులకు ఉద్యోగాలు రాక అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. అనేక కానిస్టేబుల్ ఉద్యోగాలు బ్యాక్ లాక్ కింద పడిపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని డీఎస్సీ, గ్రూప్–2, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంకైన ఒకే అభ్యర్థులను గుర్తించి వారి చేత అన్ విల్లింగ్ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతనే కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సుభాష్, షేక్ జామల్ బాషా, సంతోష్, రవితేజ, సాయికుమార్, యాసిన్, వికాస్‌బాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

బల్లికురవ: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసే ప్రయత్నం చేస్తుందని.. తక్షణమే లేబర్ కోడ్ బిల్లును రద్దుచేయాలని బాపట్ల జిల్లా సీపీఎం పార్టీ సభ్యుడు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం బల్లికురవలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించి సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఎం నాయకులు గొల్లపూడి అంజయ్య, పాలవులూరి రమణయ్య, వంతా వీరయ్య, కె. ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులు హేయం



న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చీరాల రూరల్: న్యాయవాదులపై రాష్ట్రవ్యాప్తంగా దాడులు జరుగతున్న నేపథ్యంలో దాడులను నిరసిస్తూ సోమవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలోని న్యాయదేవత విగ్రహం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్‌బాబు, మేరుగ రవికుమార్‌లు మాట్లాడారు. ఇటీవల మచిలీపట్నంలో ఓ న్యాయవాదిపై అక్కడి డీఎస్పీ అనుచితంగా ప్రవర్తించి దాడి చేయడాన్ని బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పోలీసులు న్యాయవాదులను లక్ష్యంగా చేసుకుని ప్రతి చిన్నవిషయానికి కూడా దాడులకు పాల్పడుతున్నారని ప్రభుత్వం తక్షణమే స్పందించి అటువంటి పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బండ్లమూడి విజయ్‌కుమార్, మహిళా ప్రతినిధి స్నేహ, జికె. ఈశ్వరిరెడ్డి, న్యాయవాదులు బండారుపల్లి హేమంత్‌కుమార్, కరవది భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించాలి



క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. అమలు కాని హామీలను గుప్పించి అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను ఇకనైనా ప్రజలు గుర్తించాలని పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి అన్నారు. చంద్రబాబు మోసాన్ని గుర్తు చూస్తూ సోమవారం ఇంకొల్లు మండల పార్టీ అధ్యక్షులు చిన్ని పూర్ణారావు అధ్యక్షత 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని మండల స్థాయిలో ఇంకొల్లులోని కొణికి కోదండరామ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ముందుగా మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పేరుతో పథకాలను అన్ని ప్రజలకు ఇచ్చేశామని చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. సూపర్ సిక్స్ గురించి ప్రశ్నిస్తే నాలుక కట్ చేస్తామని చంద్రబాబు అనడం ఆయన అహంకారానికి నిదర్శమన్నారు. నిరుద్యోగ భృతి, బాబు వస్తే జాబు, ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం వంటి పథకాలను చెప్పారన్నారు. తల్లికి వందనం పేరుతో రూ.15వేలు ఇస్తానని చెప్పి రూ.2 వేలు తగ్గించి జమ చేశారన్నారు. సాకుల పేరుతో చాలా మందికి డబ్బులు జమ కాలేదన్నారు. రైతులకు ఇచ్చిన హామిలను మూలనపెట్టేశారన్నారు. రైతులకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు.

పొగాకు రైతుల పరిస్థితి మరీ దారుణం..

పొగాకు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారన్నారు. పథకాలు అమలుపై ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు పెట్టించి సంతృప్తి చెందుతున్నారన్నారు. చంద్రబాబు మోసాలను తెలియజేసే క్యూర్ కోడ్ కలిగిన పత్రాలను ఇంటింటికి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలు ఏఏ పథకాలు అందక నష్టపోతున్నారో వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, జిల్లా ఉపాధ్యక్షులు పఠాన్ కాలేషావలి, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ ఉపాధ్యక్షులు భవనం శ్రీనివాసరెడ్డి, యద్దనపూడి మండల కన్వీనర్ రావూరి వేణు, ఆయేషా బుడే, నూతలపాటి బలరాం, లతీఫ్, షంషుద్దీన్, హరేరామరెడ్డి, కాటి లక్ష్మణ్, గుంటూరు శ్రీను, బెల్లంకొండ వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని వినతి

చీరాల టౌన్: గడిచిన ఐదేళ్లలో రేషన్ సరుకులకు ఎలాంటి ఇబ్బందులు పడలేదు.. ఇళ్ల వద్దకే వాహనాలు వచ్చి సరుకులు ఇచ్చేవారు. ప్రస్తుతం మా నివాసాలకు దూరంగా రేషన్ షాపు ఏర్పాటు చేయడంతో సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని చీరాల మున్సిపాలిటీలోని 24, 25 వార్డు ప్రజలు అధికారులకు సమస్యను విన్నవించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో మున్సిపాలిటీలోని 24, 25 వార్డులకు చెందిన ప్రజలు తమ నివాసాలకు కిలోమీటరు దూరంలో ఉన్న హరిప్రసాద్ నగర్ రేషన్ దుకాణానికి తమ కార్డులు బదిలీ చేయడంతో రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకునే తమకు రేషన్ సరుకులు తాము నివసించే ప్రాంతంలో ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డీటీ సుశీలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పలువురు ప్రజలు పాల్గొన్నారు. అలానే నివేశన స్థలాలు, రేషన్‌కార్డులు, ఇతర సమస్యలపై 17 అర్జీలను డీటీకి అందించారు.



డీటీకి వినతి పత్రం అందిస్తున్న ప్రజలు

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

పర్చూరు(చినగంజాం): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలల్లో జరిగే జయంతి కార్యక్రమాలలో ఆయన స్వయంగా పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేయనున్నారు. కార్యక్రమానికి పార్టీ మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరుకావాలన్నారు.

చీరాల అర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం 9గంటలకు స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని వైఎస్సార్ కాంస్య విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి జిల్లా వైఎస్సార్ సీపీలో వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, చీరాల నియోజకవర్గంలోని వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అందరూ హాజరు కావాలన్నారు.

మార్టూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను నేడు మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని మార్టూరు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మండల కేంద్రం మార్టూరులో నేటి ఉదయం 10 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గల వైఎస్సార్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అద్దంకిలో..

అద్దంకి రూరల్: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి 76వ జయంతి వేడుకలను మంగళవారం అద్దంకి నిర్వహించనున్నట్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా స్థానిక 20వ వార్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మేరుగు నాగార్జున పాల్గొననున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ హోదాల్లో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలి రావాలని కోరారు.

సొంతూరుకు సేవ చేయడం అభినందనీయం

అద్దంకి: తాను జన్మించిన గ్రామంలోని పాఠశాలలను దత్తత తీసుకుని సౌకర్యాలు కల్పిస్తున్న పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అభినందనీయుడని ప్రధానోపాధ్యాయురాలు అన్నారు. ఆయన సోమవారం మండలంలోని తిమ్మాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.7500 విలువ చేసే స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పురుషోతమ్మ మాట్లాడుతూ శ్రీరామచంద్రమూర్తి సొంతూరు తిమ్మాయపాలెంలోని పాఠశాలకు సహాయం చేయడంలో ముందుంటారని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన అనంతు శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని పాఠశాలలకు పెద్దమనసుతో పుట్టంరాజు అవసరమైన అన్ని పుస్తకాలు ఇస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బీసీ పూర్ణచంద్రరావు, రోటరీ కార్యదర్శి అలహరి హరిప్రసాద్, ట్రెజరర్ గురుశేఖర్, మాజీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, చుండూరి మురళీసుధాకరరావు, పువ్వాడ రామ కోటేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో దాతలు